**కథానిక:**

# లెస్ లగేజ్, మోర్ కంఫర్ట్

శ్రీ మధురాంతకం రాజారాం

"డియర్ శేఖరం!

అయిదు సంవత్సరాల తర్వాత జాబు రాస్తున్నందుకు ఆశ్చర్యపడొద్దు. ఇంతకాలం రాయకపోవడానికి, యిప్పుడు రాస్తున్నందుకు గూడా బలీయమైన కారణాలు వున్నాయి. అవన్నీ నేరులో చెబుతాను. నీతో అత్యవసరంగా మాట్లాడవలసిన పని ఏర్పడింది. ఈ జాబు చేరగానే బయల్దేరి రావలసింది. నేనిలా జాబు రాశానని ఎవరితోనూ చెప్పొద్దు. అన్ని వివరాలూ నేరులో. నీ కోసం వేచి వున్నాను.

మురళి"

వాడిపేరుతో యింకొకడెవడైనా వ్రాసివుంటాడనుకోడానికి వీల్లేదు. మురళి దస్తూరి నాకు బాగా గుర్తే!

అయిదు సంవత్సరాలకు మునుపు అయిపులేకుండా పోయినవాడు మురళి. కనిపించలేదు అని ప్రకటన ఇవ్వడానికి వాడు చిన్నవాడేమీకాదు. అప్పటికే పట్టధారి. రాజ్యభారం స్వీకరించడానికి ముందు మళ్ళీ అవకాశం దొరకదన్న వుద్దేశంతో ఎవరితోనూ చెప్పకుండా దేశాటనకు వెళ్ళిపోయిన రాకుమారుడిలా అతడు మటుమాయమైపోయాడు. మళ్ళీ యింతకాలానికి జాబు!

* * * *

నేనూ, మా మురళి చిన్నప్పుడు మా వూరి ఏటి ప్రక్కన, కొబ్బరిచెట్ల నీడలో ఎన్నెన్నో పిచ్చుకగూళ్ళు కట్టుకున్నాం. పిచ్చుక గూళ్ళేకదా అని తేలికచేసి పారెయ్యడం అన్యాయం. తాజ్మహలు నిర్మాణం కోసం షాజహాను తీసుకున్న శ్రద్ధాసక్తులను గురించి ఘనంగా చెప్పుకుంటారు. మా పిచ్చుకగూళ్ళ నిర్మాణంలో మా శ్రద్ధాసక్తులంతకు తక్కువైనవేమీకాదు. తలదాచుకోడానికి గూడు లేక నిరాశ్రయంగా పడివుండే గువ్వలు చీకటిపడగానే వచ్చి ఆ గూళ్ళల్లో హాయిగా విశ్రమిస్తాయని మేమనుకునేవాళ్ళం. చిన్నతనంలోనే అంతలావు ఉపకారచింతన కలిగి వుండడం మాకెంతో గర్వకారణంగా వుండేది. గడ్డాలూ మీసాలూ వచ్చి, తలలు గూడా పండి, పెద్దరికాల కన్నింటికీ తామే దిక్కయినట్టుగా తిరిగే మా వూరి పెద్దమనుషుల్ని చూస్తుంటే మాకొకవైపున ఒళ్ళు మండుకపోతుండేది. వెనకటి కెప్పుడో ఎవడో ఒక పుణ్యాత్ముడు వూరినడుమ కట్టించిపోయిన ధర్మసత్రం పైకప్పు కూలిపోయి, గోడలు నెర్రెలుపడి, ద్వారబంధాలు వ్రాలిపోయి, అంతా ఒక శిథిల గృహం సెట్టింగులా తయారైపోతుంటే వీళ్ళేం కట్టించుకున్నారు? వీళ్ళేలాగూ కొత్తగా గుళ్ళు కట్టించలేరు. ఉన్న గుడిలో పూజా పునస్కారాలూ లేక, దీపంపెట్టే దిక్కయినా లేక ఖిన్నుడై కూర్చున్న ఆ దేవుడిసంగతి వీళ్ళకేం కావాల్సింది? పోనీ, బడిసంగతే చూద్దాం. గవర్నమెంటు వారి కళ్ళు తుడవడం కోసం యిక్కడొక బడికట్టడం వున్నమాట నిజం! ఇంతే సంగతులు. బడికి కావలసిన హంగులకు సంబంధించి అది అయ్యవారి నట్టిల్లు. కుర్రవాళ్ళు కూర్చునే కొయ్య పలకల్ని దొంగలెత్తుకపోయారు. పాఠాలు బోధించడానికి ఉపకరించే మ్యాపుల్ని, చార్టుల్ని చెదలు తినిపోయాయి. అసలా బడి కట్టడం నెలకొల్పిన వాళ్ళకు కాలక్రమంలో చదువుకునే కుర్రవాళ్ళ సంఖ్య పెరగవచ్చునన్న వూహేవుండి వుండదు. బడిముందర పెద్దరావిచెట్టు ఒకటి వుండబట్టి, దాని నీడక్రింద మూడు తరగతులు ధారాళంగా కూర్చోడానికి వీలుండడం పిల్లల అదృష్టం. లేకుంటే అన్నం వున్నం ఎరుగని కుర్రకుంకల నందరినీ ఒక మందలా ఆ వూరికొంపలోకి తోలిపెట్టి, చరిత్రలో 'కలకత్తా చీకటిగది' లాంటి ఉదంతం యింకొకటి సృష్టించవలసి వచ్చేది. అబ్బబ్బ, వాభరంలేదని కస్సుబుస్సులాడే వాడు మా మురళి. మనుషుల్లో స్వార్థం బలిసింది. తాము ఈ ప్రపంచం కోసమేనన్న భావన నశించింది. ఈ ప్రపంచమంతా తమకోసమేనన్న స్వాతిశయం హెచ్చింది. ఎవడికడుపే వాడికి కైలాసమైపోయింది. ఇదంతా యిలా జరగగూడదనేవాడు మురళి. హైస్కూలున్న చిన్నబస్తీకీ, మా వూరికీ మధ్య దూరం అయిదుమైళ్ళు. పుస్తకాల సంచి భుజానికి తగిలించుకుని, ఖాళీ అయిన అన్నం కారియర్‌ని ఒక చేతితో పట్టుకుని, సాయంకాలాల్లో యింటికి తిరిగొస్తూ తారురోడ్డు పొడుగునా మేము ఒక ఆదర్శ నవసమాజానికి రూపకల్పన చేస్తూ వచ్చాం. అక్కడ దరిద్రం వుండదు. చీకుచింతలుండవు. దుర్వ్యసనాలుండవు. 'ఇంతై, అంతై, మరియు తానంతై' అన్నట్టుగా అది వామనుడంతో ఎత్తుకు పెరిగే సమాజం!

'బేష్, బాగానేవుంది. కానీ ఆ సమాజానికి వెళ్ళేదారి ఎటువైపుగా వుందో, గమ్యస్థానం చేరుకోడానికి ఆ దారిగుండా ఎంతదూరం వెళ్ళాలో తెలియకుండా వుంది ..' అనేవాణ్ణి.

'ఏముంది? నువ్వు నాటకాలు రాస్తావు నేను వేషం వేస్తాను. నిప్పుకు వాయువు తోడైనట్టు! కాల్చిపారేద్దాం' అనేవాడు మురళి.

మా మురళి తరపు. నేను వేడుకుంటున్నాను. మురళిని మీరు మన్నించాలి. అతడు కాల్చిపారెయ్యాలన్నది లోకాన్నికాదు— కుళ్ళును, కుసంస్కారాన్ని, కుటిలత్వాన్ని! చేసినా అంతపనీ చేయగలిగినవాడే మురళి! నా బుద్ధికలా అనిపించేది. 'నాకు నచ్చిన హీరో' లక్షణాలు ఆలనాటి అతడి చిన్న ఆకారంలోనే నాకు కనిపించాయి. స్వతహాగా నేనే గొప్పవాడిని కాగలనన్న ఆత్యాశ ఆ చిన్న వయసులోనైనా లేకపోవడం భగవంతుడు నాకిచ్చిన గొప్పవరం! కానీ గొప్పవాడికి ప్రక్కవాడుగా ప్రసిద్ధికెక్కడం మాత్రం అందరికీ లభించే భాగ్యమా?

అంతలో మా హైస్కూలు చదువు ముగిసింది.

మా మురళి మాటలద్వారా మీ రీపాటికి గ్రహించే వుంటారు అప్పటికే నేను దాదాపుగా కొంత వ్రాతగాణ్ణి! పరీక్షల తతంగమంతా వ్రాతతో గూడినదే గనుక, వ్రాతనుబట్టి పరీక్షలో నాకు కాస్త ఎక్కువ మార్కులే వచ్చాయి. కాలేజీకి వెళ్ళివుంటే ఆ మాత్రం మార్కులకు నాకొక స్కాలర్‌షిప్పు దొరక్కపోయేదిగాదు. కాని కాలేజి చదువుపైన ప్రలోభం పెట్టుకోడానికి వీల్లేకుండా చేసింది మా కుటుంబ పరిస్థితులు. నేను ఫోర్తుఫారంలో వున్నప్పుడు మా నాన్నగారు కాలంచేశారు. ముగ్గురు చెల్లెళ్ళకు పెళ్ళి చేయవలసిన భారం నా భుజాలపైన వుంది. పిత్రార్జితంగా కొంతపొలం మిగిలిందన్న మాటేగాని, దానిపైన వచ్చే రాబడి మా తిండికైనా కటాకటిగా సరిపోయేదిగాదు.

కుటుంబపరిస్థితుల దృష్ట్యా మురళిగూడ సరిగా నా వంటి వచ్చినవాడే. అడిగినవాడు లేదంటే ఒక చిన్న తేడా! వాడితోబుట్టువులు వాడికన్నా పెద్దవాళ్ళు. ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఎవరి సంసారం వాళ్ళు చేసుకుంటున్నారు. ముగ్గురక్కల ముద్దులతమ్ముడు మురళి. ఈ బుజ్జి బావమరిదిపైన బావలకు గూడా చెప్పరానంత అభిమానం. వాళ్ళు భూమి తల్లితో పోరాడి బతికేవాళ్ళే కానీ తమ బావమరిదికి మాత్రం ఎద్దుల్ని కొట్టే ముదలు తినే దురదృష్టం పట్టగూడదన్నది వాళ్ల దృఢనిర్ణయం. హైస్కూల్లో సర్టిఫికేట్లు తీసుకునేవరకూ నేనూ, మురళీ కలిసేవున్నాం. సర్టిఫికేట్లు చేతికి తీసుకుని రోడ్డుపైకొచ్చాక మురళి అలాగే స్టేషనుకు వెళ్ళి పట్నానికి రైలెక్కేశాడు. నా పాటుకు నేను వెనుదిరిగి మా పల్లెకు వచ్చేశాను.

వచ్చేశానన్న మాటేగానీ నేను మాత్రం వూరుకున్నానా? రెండేళ్ళపాటు అదొక అజ్ఞాతవాసంలా ఒక ట్రెయినింగు స్కూల్లో కాలక్షేపంచేసి, టీచరుగా పని చేయడానికి కావలసిన యోగ్యతాపత్రం సంపాదించాను. అప్పటికింకా దేశంలో నిరుద్యోగ ప్రాదుర్భావం జరగలేదు. పల్లెల్లోని పాఠశాలల్ని జిల్లా బోర్డే ఏలుకుంటూ వుండేది. నేను ట్రెయినింగు స్కూలును వదలిపెట్టిన సమయానికి సరిగా మా వూరి బడిలో ఒక టీచరు రిటయిరు గావడంతో, ఆ ఖాళీకి నేను భర్తీ చేయబడ్డాను. అంతటితో నాకొక విస్తరి దొరికినట్టయింది. అరకొరగా వడ్డించిన విస్తరి అనుకోండి పోనీ!

పట్టడవిలో నుంచి అమాంతంగా ఉద్యానవనంలోకి విసిరివేయబడ్డవాడి పరిస్థితి వూహించుకోవలసిందే! నగరం తన అందచందాలన్నింటితోనూ మురళిని అలా వివశుణ్ణి చేసివుండాలి. ఆ విషయం అతడి ఉత్తరాలద్వారా నాకు తెలిసొచ్చేది. తన అనుభవాలను ఉల్లేఖించడానికి నేనొకణ్ణే బాగా దొరికిపోయాను మురళికి! అతడి అక్కచెల్లెళ్ళు చదువుకోలేదు. బావలకి గొడవేమిటో అర్థంకాదు. అందువల్ల యించుమించుగా నాదొక దుబాసీ వ్యవహారమై పోయింది. ఎటొచ్చీ వచ్చే చిక్కంతా ఉత్తరంలో డబ్బు ప్రసక్తి వచ్చినప్పుడే! నోరు విడిచి చెప్పకపోయినా అయ్యయ్యో! అంత డబ్బెందుకు?' అన్న ప్రశ్న ప్రతిఒక్కరి ముఖంలోనూ కానవచ్చేది. రెడీమేడ్ సమాధానం లేకపోలేదు. కాలేజి చదువులంటే మాటలా! ఏనుగుకు అందించినట్టుగా అందివ్వవలసిందే!

సెలవులొచ్చాయంటే పెట్టెబేడతో, పరువుతో వచ్చి మురళి పల్లెలో దిగేవాడు. ఎట్టెట్టు పది రోజులుండేసరికి పల్లెటూరి జీవితం అతడికి నచ్చకపోవడం గమనించి నేనాశ్చర్యపడేవాణ్ణి. ఎంతో ప్రియంగా వండిపెడితే—అబ్బే, బుడెం భోజనమనేవాడు. అభిమానంతో వడ్డించిన వాళ్ళ ఎదుట ముఖం ముడుచుకునేవాడు. మళ్ళీ ఆ కాలేజీ హాస్టల్లో తోటికుర్రాడి కొంటెచేష్టలను స్మరించి చెబుతుంటే ఎక్కడలేని వెలుగు అతడిముఖంలోకి పుంజుకునేది. స్వర్గం నుంచి అమాంతంగా నేలపైకి జారిపడిన దివ్యపురుషుడిలా అతడు తనను తాను భావించుకుంటున్నందుకు నా మనసు చివుక్కుమనేది. కాని మమకారాలున్నచోట లోటుపాట్లు దృష్టికానవేమో! మురళిలో వచ్చిన మార్పు అతడి బంధువులకు మాత్రం అత్యంత సహజమైన పరిణామంగానే తోస్తూవచ్చింది. అవునమ్మా మరి! వాడు హాస్టల్లో దివ్యాన్నాలు తింటున్నవాడాయె! వాడికి పల్లెటూరి ఎడ్డి తిండి రుచించకపోవడంలో ఆశ్చర్యమేముంది, యింకా రుచిస్తేనే ఆశ్చర్యపడాలి గానీ! పట్నంలో నాగరీకపు మనుషులతో కలిసిమెలిసి వుంటున్నవాడుగదా, వాడికి పల్లెలోకి వచ్చిపడితే నీళ్ళలోని చేపను ఒడ్డుకి విసిరివేసినట్టే వుంటుంది పాపం! అయినా యిప్పుడైతే చదువుకుంటున్నాడు గనుక సెలవల్లో గడపడం కోసం యిలా రావలసివస్తోందిగానీ, లేకపోతే ఈ మురికి కొంపల్లో పడివుండడానికి వాడి కర్మం కాలింది!

ఇక్కడ మురళితో నా స్నేహం గురించి కొంచెం చెప్పుకోవాలి. స్నేహానికి ఆయువుపట్టు సమానమైన అభిరుచులు కలిగి వుండడం. సాహిత్యం పట్ల గల ఆసక్తి మా కిద్దరికీ జతకూర్చివుంటుందని నేననుకునేవాణ్ణి. మేమిద్దరం కలిసి హరికథలకు వెళ్ళేవాళ్ళం. వీధినాటకాలు చూచేవాళ్ళం. ఏదైనా పుస్తకం దొరికితే ఒకరు బిగ్గరగా చదువగా, యింకొకరం వినేవాళ్ళం. హైస్కూలు మేగజైనులో ఒకటి రెండు రచనలు పడ్డంవల్ల నాకు రచయితగా పరిగణన వచ్చినట్టే, యానివర్సరీ నాటికల్లో పాల్గొనడంవల్ల వాడికీ నటుడన్న గుర్తింపు వచ్చింది. ఐతే మురళి పట్నానికివెళ్ళి అక్కడ జీవితానికి బాగా అలవాటు పడిపోయిన తర్వాత అతడి కళాభిరుచిలోనూ సైతం నాకు మార్పు కనిపించసాగింది. ఒకసారి సెలవుల్లో యింటికొచ్చినవాడు హుటాహుటిగా నన్ను చేటీ చేసి ప్రత్యేకంగా అభినందించి పారేశాడు. అందుకు కారణం ఆమధ్య ఏదో పత్రికలో పడిన నా కథ. 'చదివావా' అన్నాను. లేదన్నట్టు తలడ్డంగా తిప్పాడు. 'నేను చదవలేదోయ్! మా ప్రసాదరావు చదివాడట! అర గంటసేపు పొగిడాడనుకో! అంతెందుకు? నేనక్కడ వుండగానే వాళ్ళ సిస్టర్ని గూడా చదవమన్నాడు........'

బతికిపోయాను! ఆ ప్రసాదరావు సిస్టరు గూడా నా కథను చదివి మెచ్చుకోడం జరిగి వుంటే, వీడునన్ను మరింత దగ్గరగా ఆలింగనం చేసుకుని ఎముకలు విరచినంత పనిచేసి వుండేవాడు!

క్రమక్రమంగా సెలవుల్లో స్వగ్రామానికివచ్చినప్పటికీ మురళి యిక్కడి మనుషులతో కలసిమెలసి కాలం గడపడం తగ్గించేశాడు. ట్రాన్సిస్టరు భుజానికి తగిలించుకుని పొలాలపైకి వెళ్ళిపోయేవాడు. అదేమిటంటే సౌందర్యారాధన అనేవాడు. మేము కలిసి ఆడుకున్న కొబ్బరితోటలకు 'సుందర్ బన్స్' అనీ, ఎండిపోయిన ఏటికి 'మెరీనాబీచ్' అనీ,మా వూరి చెరువుకు( అందులో నీళ్ళు లేకపోయినా సరే ) మానససరోవరమనీ పేర్లుగూడా పెట్టేశాడు. వీడు సౌందర్యోపాసన చేస్తున్నాడా? సౌందర్యానికి నోచుకోని వాటిని ఈసడిస్తున్నాడా? నాకు సరిగా అర్థమయ్యేదిగాదు. నగరంలో వాడు సంచరించినంతమేరకు యిళ్ళు, వాకిళ్ళు, వీధులు, పార్కులు అన్నీ తీర్చిదిద్దినట్టే వుండొచ్చు. అక్కడ మనుషులు మడత నలగని దుస్తులలో నాజూగ్గానే కనిపించవచ్చు. వాళ్ళ భాష గూడా మన్నితంగానే వుండొచ్చు. ఆ సౌందర్యం,సౌకుమార్యం పల్లెటూళ్ళకు రమ్మంటే ఎలా వస్తుంది? ఇక్కడ మనుషులు మోటువాళ్ళు. వీళ్ళ ఆకారాలు, వీళ్ళ వేషభాషలు, అంతెందుకూ, వీళ్ళ జీవన విధానమంతా మోటుగానే వుండొచ్చు. కానీ ఈ చీకటి బతుకుల్లో కొత్త వెలుగులు నింపాలని కలలుగన్నవాడు కాడా ఈ మురళి! నాలుగైదేళ్ళపాటు పట్టణంలో వుండిరావడంతో వీడు పల్లెటూళ్ళ పరిస్థితులను పూర్తిగా అసహ్యించుకునే స్థితికి వచ్చాడా? నేను నమ్మలేకపోయేవాణ్ణి. ఏమైనప్పటికీ మురళి మూలంగా ఒకవేళ ఆశాభంగం పొందవలసి

వచ్చినా అందుకు నేను తట్టుకోగలను. అందుకు సిద్ధంగా లేనిది అతడి బంధువులే!

మురళి పెట్టాపుచ్చుకునే రోజులు దగ్గర పడుతున్నాయి.

'ఏమిటోయ్ మురళీ! చదువులైపోవస్తున్నాయిటగా! పెళ్ళెప్పుడు? ఎవర్ని చేసుకుంటావు?' అన్న ప్రశ్న ఒకటికొత్తగా మురళిని ఎదుర్కోసాగింది.

ఆ విషయంలో గూడా మురళి అదృష్టవంతుడే! కొత్తగా వధువు కోసం వెదుక్కోవలసింది లేదు. చేయవలసిందల్లా ఎన్నుకోడమే! మురళి అక్కయ్యల్లో పెద్దవాళ్ళకిద్దరికీ ఈడొచ్చిన కూతుళ్ళున్నారు. పెద్దక్కయ్య కూతురురాజ్యాలు. ఆ రాజ్యాలు అనే పిల్లను, అది పుట్టినప్పటినుంచీ మురళికి పెళ్ళాంగానే వ్యవహరించుకుంటున్నారు. 'ఏమేం రాజ్యాలూ! నీ మామవచ్చాడటగా! నీకేంతెచ్చాడు? చెవులు పిండి, ఆముదముబుడ్లు ఎప్పుడేస్తావు మామా అని అడగలేకపోయావా?' ఇదీ వరస!

మురళి కాలేజీనుంచివిడుదలైన సంవత్సరం దేశం సుభిక్షంగా వుంది. చెరువులు నిండి పంట యిబ్బడిగా పండింది. గరిసె నిండుకూ వడ్లుపోసుకుని మురళి పెద్ద బావ పెళ్ళికి సన్నాహాలు ప్రారంభించాడు. మురళికెందరో స్నేహితులు. వాళ్ళందరూ పెళ్ళికి వచ్చేస్తారు. ఆ రాబోయే స్నేహితుల వసతి సదుపాయాల కోసం అతడు నో పదంకణాలమట్టె మిద్దె వేయించాడు. బాల్ రూము కట్టించాడు. పెళ్ళి పందిరికోసం అడివినుంచి వెదుళ్ళు తెప్పించాడు. ఇంటి ముంగిట ఆరుబయలంతా గచ్చుచేయించాడు.

పరీక్షలయిపోయిన తర్వాత అలా అలా మిత్రుల ఊళ్ళన్నీ తిరిగి మురళి నిదానంగా యింటికి తిరిగి వచ్చేసరికి యిక్కడ అతడికోసం ఒకటే తొందరపడిపోతున్నారు.

మురళి వచ్చాడు. చూచాడు. ఇల్లంతటా పెళ్ళికళ తాండవిస్తోంది. మురళి ఏమనుకున్నాడు? ఆ భగవంతుడికే తెలియాలి. తన కీ పెళ్ళి యిష్టంలేదని, అతడు చూచాయగా కనీసం నాతోనైనా చెప్పలేదు. మీదుమిక్కిలి దుస్తులు కుట్టించుకోడానికని, గడియారానికని బావ దగ్గర వెయ్యి రూపాయలు పుచ్చుకున్నాడు. రేపీపాటికల్లా వచ్చేస్తానని చెప్పి బస్సెక్కేశాడు.

అదేపోవడం! రోజులు, నెలలు, సంవత్సరాలు గూడా గడిచిపోయాయి. మిలిటరీలో చేరిపోయివుండవచ్చునన్నారుకొందరు. హఠాత్తుగా అతడికి మతి చలించి వుండచ్చునన్నారు కొందరు. చివరికందరూ కలిసి మురళిదేం తప్పులేదు. అదంతా ఆ రాజ్యాలనే పిల్లగ్రహచారమన్నారు. నా మట్టుకు నేను మాత్రం ఏమీ అనలేదు. ఈ జన్మలో మురళి ఎప్పుడైనా తారసపడితే చాచి ఓ లెంపకాయ కొట్టాలని మాత్రం అనుకున్నాను.

ఆ సదుద్దేశం సఫలం గావడానికి ఒక అవకాశంయిస్తున్నట్టుగా నాకో మురళి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది!

* * * *

మదరాసు మహానగరానికి నా చిన్నతనంలోఎప్పుడో ఒకసారి వెళ్ళివున్నాను. మా నాన్నగారు నా కప్పుడు సముద్రాన్ని, చచ్చిన—బ్రతికిన కాలేజీలను చూపించారు. ఆ నగరాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా సముద్రంలో అయోమయంగా రవళించే అలలు, మృగశాలలో వుండి వుండి క్రూరంగా అరిచే అడవి మెకాలు, మ్యూజియంలో సేదదీరుతున్నట్టున్న జంతువుల మృత కళేబరాలు నాకు జ్ఞప్తికొస్తుంటాయి. మురళి ఉత్తరం వచ్చిన తర్వాత మదరాసుకు తరచుగా వెళ్ళివచ్చే ఒక పెద్దమనిషిని కలిసి, రాయపేట ఎక్కడుంటుందో వాకబు చేశాను. ఆయన 'రాయపేటా రాయపురమా?' అంటూ నాకే ఒక ఎదురు ప్రశ్న వేశారు. నాకు తెలిసినంతలో పేట, పురము పర్యాయపదాలే! బహుశా అవి రెండూ ఒకటే అయివుండవచ్చునన్నాను. ఆ పెద్దమనిషి ఫక్కుమని నవ్వేశాడు. మదరాసుకు బయల్దేరకముందే ఆ ఊరికి సంబంధించిన నా అజ్ఞానం యిలా వెల్లడయింది. మరింతగా అజ్ఞానాన్ని బయట పెట్టుకోడమెందుకని రైల్లో బయలుదేరివస్తున్నాననీ, స్టేషనుకు వచ్చి కలుసుకోవలసిందనీ మురళి యిచ్చిన చిరునామాకొక ఉత్తరం వ్రాసి పడేశాను.

వ్యక్తులు తమ బాధ్యత తెలిసి నడుచుకోడంపైన కుటుంబ బాధ్యత ఆధారపడి వుంటుంది. వ్యక్తిగా మురళి తనపైన ఎన్నోఆశలు పెట్టుకున్న కుటుంబాలపైన దారుణంగా దెబ్బ తీశాడు. తనను కన్నబిడ్డకన్నా ఎక్కువగా చూచుకున్న అక్కచెల్లెండ్లు యితడిమూలంగా సంఘంలో నగుబాట్లకు మాత్రమే నోచుకున్నారు. వాడి చదువులకోసం చేసిన అప్పు నిన్న మొన్నటిదాకా తీరలేదు. అయినసంబంధం అర్ధాంతరంలో తెగిపోయిన తర్వాత ఆ రాజ్యాలనే పిల్లకు కొత్త సంబంధం కుదిర్చి పెళ్ళి చేసేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. ఇంత గొప్పగా నిర్వాకం వెలగబెట్టిన మురళిని నేనిప్పుడు కలుసుకోబోతున్నది! ఇంత పని చేసిన తరువాత వీడు తగుదునమ్మా అని ఏ ముఖం పెట్టుకుని నా ముఖంకేసి సూటిగా చూడగలడు? నేను మాత్రం మనసు విప్పి వాడితో మునుపటిలా ఎలా మాట్లాడగలను? ప్రయాణం చేసినంత సేపూ నేను రైల్లో వాడిపైన కారాలూ మిరియాలూ నూరుతూనే కాలం వేగించాను. నూరిన సరుకునంతా వాడి తలకు వేసి పులిమేదాకా నా ఆవేదన ఉపశమించేటట్టు లేదు.

నా ఆలోచనలో నేనుండగానే బండి సిటీ సివార్లు దాటేసిందన్నారు.

అదిగో భద్రాద్రి, ఇదిగో గౌతమి అన్నట్టుగా—ఇదిగో బేసిన్ బ్రిడ్జి, అదిగో సెంట్రల్ అని గూడా అనేశారు.

రైలు స్టేషనులో ఆగింది.

ఆ రోజు సెంట్రల్ స్టేషను నేల యీనినట్టు జనంతో కిటకిటలాడిపోతూవుంది అని నేను చెప్పను. ఎవరు చూచారు? తేరుకు, తిరణాలకు చేరినట్టుగా అక్కడ ప్రతిరోజూ అల జనం గుమిగూడుతూనే వుండొచ్చు. ఈ నగరాన్ని విడిచిపెట్టి వెళ్ళేదాకా తప్పుడు స్టేటుమెంట్లు యివ్వకుండా, నోటికి వచ్చినట్టల్లా వాగకుండా ఒళ్ళు దగ్గరగా పెట్టుకుని నేను జాగ్రత్తగా మసలుకోదలచుకున్నాను. రైలెలాగూ ఆగింది. కానీ నెమ్మదిగా దిగిపోవచ్చునని ఏ ఒక్కరూ అనుకోకపోవడమే విచిత్రం! ముందుగా దిగిన వాళ్ళకు అక్కడెవరో బహుమతి ఇస్తున్నట్టుగా ద్వారం దగ్గర ఒక బల ప్రదర్శనం ఏర్పాటు చేశారు. నేను నింపాదిగా నా సీటు దగ్గరే నిలబడి ప్లాట్ ఫారం వైపు చూచాను. ఈ జన సముద్రంలో ఎక్కడో మురళి గూడా వుండివుండాలి. ఎక్కడున్నాడు? అసలు వాడిప్పుడు ఎలా వుంటాడు?

మురళి జాడ కనిపించకముందే కంపార్టుమెంటు ఖాళీ అయిపోయింది.

దిగి ప్లాట్ ఫారంపైకి వచ్చాను. మెల్లగా పదిబారల దూరం ముందుకు నడిచాను.

ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకుంటూ నా కెదురుగా వచ్చి ముందుకు సాగిపోతున్నారు.

నేను తిరిగి చూచాను. ప్రయాణీకులు బయటికి వెళ్ళిపోయే ద్వారం అటువైపున్నట్టుంది.

పెద్ద మాయల మరాఠీ గుహలా ఈ స్టేషన్ని కట్టిపెట్టినవాళ్ళని ప్రశంసించాలి. మనం గూడా అటువైపు వెళ్ళవలసిందేనేమో!

మళ్ళీ వెళ్ళినంత దూరం తిరిగి వచ్చివుంటాను. ఎటువైపునుంచి వచ్చిందో తెలియదు. హఠాత్తుగా ఓ చేయి వచ్చి నా భుజంపైన వ్రాలింది.

కళ్ళ ఎదుట ప్రత్యక్షమైన ఆకారం వైపు ఎగాదిగా చూచాను.

పల్లిద్దాల కళ్ళజోడు. తుమ్మెదరెక్కల్లా పొంకమైన మీసాలు. కొన్ని శిలాశిల్పాలలో కనిపించేటట్లుగా అందమైన కేశాలంకరణ, పొట్టి చేతులచొక్కా, క్రింద కాళ్ళను కవచంలా అదిమి పట్టుకున్న పాంటు. ఇటీవలి నాలుగైదేళ్ళలో యింకొక రెండంగుళాల ఎత్తు పెరిగి, అందుకు తగినంతగా ఒళ్ళు గూడా చేసిందేమో నునుపు బాగా దుక్కయినుములో చేసి నిలబెట్టిన విగ్రహంలా వున్నాడు.

'ఏమిటోయ్ శేఖరం! నన్ను గుర్తుపట్టలేక పోయావ్ గదూ! నే ననుకున్నానులే! అనుకున్నట్లే జరిగింది. సర్లే. నువ్వొచ్చేశావు. మాటంటే అలా గుండాలి. పోర్టరుని పిలవనా శేఖరం! లగేజేదీ?'

నేను నా చేతిలోవున్న చిన్న తోలుసంచీ చూపించాను.

'ఓహ్, అదేనా, పరవాలేదే! చూచావా శేఖరం! 'లెస్ లగేజ్, మోర్ కంఫర్ట్.' అని రైల్వేవాళ్ళు చెబుతారు. వినిపించుకునే వాళ్ళెవరు, ఎవరో నీలాంటి వాళ్ళు తప్పిస్తే!'

వెళ్దాం పదమన్నట్లుగా భుజంపైన చేయివేశాడు మురళి. పువ్వుతో చేరిన నారకు పరిమళం అబ్బుతుందంటే ఏమిటో అనుకునేవాణ్ని. అప్పుడు తెలిసింది. మురళి నన్ను యీవలికి తీసుకొస్తుంటే టికెట్ కలెక్టరు తెల్లబోయి చూస్తున్నాడే తప్ప 'టికెట్టెక్కడ' అని అడగలేక పోయాడు.

అంతలో వున్నట్లుండి జ్ఞప్తికి వచ్చినట్లు 'ఏదీ, దాన్నిలా యివ్వు శేఖరం! నేను తీసుకొస్తానులే' అంటూ నా చేతిలో వున్న సంచీ అందుకోబోయాడు మురళి. 'అబ్బే ఎందుకూ యిదేం బరువు' అన్నాను.

'అదేంమాట! నువ్విప్పుడు నాకు అతిథివి. ఇక్కడినుంచి వెళ్ళేదాకా నువ్వు నేనెలా చెబితే అలా వినాలి. మారుమాట లేకుండా నేను చేసే సత్కారాలన్నీ స్వీకరించాలి. అతిథి దేవోభవ అంటే మరేమిటనుకున్నావు శేఖరం?' విన్న వాళ్ళేమనుకుంటారో నన్న విచక్షణ లేకుండా డబ్బారేకుల పైకప్పు ఎగిరి పోయేటట్లు నవ్వసాగాడు మురళి.

బాబోయ్, వీడినేనా నేను మందలించాలనుకున్నది? వీడు మందలింపులకు అతీతమైన స్థితిలోకి వెళ్ళిపోయినట్లున్నాడు.

ఎందరో మనుషులు ఎదురవుతున్నారు. సైకిళ్ళు ఢీ కొట్టుకోబోయి తప్పించుకుంటున్నాయి. కలాలు, దువ్వెన్లు, టూత్‌బ్రష్షులు అమ్మజూపే వాళ్ళు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. ఏ అడ్డంకినీ లెక్కపెట్టకుండా మురళి నన్ను దూరంగా లాక్కొచ్చేశాడు.

'ఏ నెంబరు బస్సు?' అన్నాను నోరు జారి.

'బస్సా! ఇంకా నయం! లారీ అన్నావుకాదు. ఎక్కు ఎక్కు' అంటూ టక్‌మని తలుపు తెరచి నన్ను కారు లోపలికి తోశాడు మురళి.

కారు కదిలింది. కదిలిన కారయితే వేగం పుంజుకుంది గాని, నా ఆలోచన మాత్రం ఆ కారుచుట్టే గింగుర్లు కొడుతూ వుంది. చూడగానే కారు పేరేమిటో చెప్పగల పరిజ్ఞానం నాకులేదు. ఇదేం కారోగానీ, చాలా మంచి కారల్లేనే వుంది. లోపలా బయటా గూడా ఎంతో అందంగా వుంది. అందులో కూచున్నాక ఒక చిన్న పుష్పక విమానంలో తేలిపోతున్నట్లే తోచింది. ముమ్మరంగా రాకపోకలు సాగుతున్న రోడ్డుపైన డ్రయివు చేస్తూ చేస్తూ మురళి సిగరెట్టు ముట్టించుకో గలిగిన వైఖరిని బట్టిచూస్తే, వాడికీ కారు, ఈ డ్రయివింగు, ఈ రోడ్డు, యిదంతా చాలా పాతబడిన వ్యవహారమై వుంటుందనే అనిపించింది.

కానీ అతడెంతో సేపు నా ఆలోచనల్లో నన్నుండ నివ్వలేదు. అతిథి సత్తముడి కాలక్షేపానికి కొరత రాకుండా వుండడంకోసం అతడు కొన్ని ముఖ్యమైన వర్తమానాలను నాకు నివేదించసాగాడు. ఈ మధ్య సిటీ కార్పొరేషన్ చాలా బాగుపడిపోయిందట! వీధుల పరిశుభ్రతను, పార్కుల ఒయ్యారాన్ని చూచి కేంద్రమంత్రి ఒకాయన తెగ మెచ్చుకున్నాడట! తెలుగువాళ్ళు సతపోరి ఒక రాష్ట్రమైతే తెచ్చుకోగలిగారు గానీ, తెలుగు సినిమా పరిశ్రమను మాత్రం యిక్కడి నుంచి లేవదియ్యలేక పోయారట. 'అంతెందుకూ!' అంటూ మొదలంకించుకున్నాడు మురళి. 'కూవం నదిలో మొసళ్ళున్నాయి గదా! ఏదీ, మూసీ నదిలో ఒక్కటి చూపించు!'

నేను మురళి ప్రసంగాన్ని వింటున్నానో, రోడ్డుపైన అతడు కారునొక ఆటబొమ్మగా చేసి దొర్లించుకపోవడాన్ని గమనిస్తున్నానో చెప్పలేను. వెళ్ళి వెళ్ళి ఓ అరగంట సేపట్లో కారొక యింటి ముందర నిలిచింది. ఆ యిల్లు గూడా యిలాంటి కారును కలిగివుండడానికి తగినంత హుందాతనంతోనే ఒప్పారుతోంది. చాక్‌లెట్ ముక్కలా కొరుక్కుని తినేయాలన్నంత ముచ్చటగ వున్న కట్టడం. ముంగిట చిన్న పూలతోట. లోపలికి వెళ్తుంటే తివాసీలు, సోఫాసెట్లు, గోడలపైన చిత్తరువులు అంతా శోభాయమానంగా వుంది. కానీ మురళిలో నాకు కనిపించిన సుగుణమేమిటంటే, వాడు తన ఐశ్వర్యాన్ని చూచి చకితుణ్నై అయిపోవడానికి నాకు అవకాశమే యివ్వడం లేదు. ఇదంతా ఒక సర్వసామాన్యమైన విషయమైనట్లుగా ఎడతెగని ప్రసంగంతో నా మనసుని ట్రాక్టరులా దున్నుక పోతున్నాడు.

'కూచో శేఖరం! రైల్లో దూర ప్రయాణమంటే ఏమిటి? ఒళ్ళు చిత్తు చిత్తయిపోయిందన్నమాటే! కాసేపు సేదదీరు' అంటూ లోపలికి వెళ్ళాడు. నిమిషంలో దుస్తులు మార్చుకున్నాడు. మళ్ళీ హాల్లోకి వచ్చి, గోడకు తాపడం చేసివున్న మరనొక్కి యింట్లో గింగురింగుమంటూ ఒక కలరవం పుట్టించాడు. పదేళ్ళ పిల్ల ఒకతె పరుగెత్తుకుంటూ వచ్చింది. 'అతిథులొచ్చారని అమ్మగారితో చెప్పు' అన్నాడు. వెంటనే నా వైపు తిరిగాడు. 'అమ్మగారంటే ఆ పిల్లకు తల్లి అనుకునేవు! అదేంకాదు. సాక్షాత్తుగా మా ఆవిడే! నీ కథలంటే తనకు ఒళ్ళు మాలినంత అభిమానం. పడి చస్తుందనుకో! నువ్వు నా స్నేహితుడివంటే మొదట నమ్మలేక పోయింది. 'చూస్తూ వుండు! ఎప్పుడో ఒకప్పుడు రప్పిస్తా' నంటే 'అంతటి గొప్పవాడు మనింటి కొస్తాడా' అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చింది.'

పట్టణానికి దూరంగా ఒక కుగ్రామంలో, కిటికీలు లేని పూరి కొంపలో, బుడ్డి దీపం ముందు కూర్చుని రచనలు చేసుకునే నావంటివాడిపట్ల ఒక పాఠకురాలు యింత గొప్ప అభిప్రాయం కలిగి వుండడం ఎంత ఆశ్చర్యం! తన్మయుణ్ని కావడానికి నా కంతకంటే మహదవకాశం ఎప్పుడు లభిస్తుంది? కాని 'అంతపని' జరిగేలోపుగా నాలో ఒక అనుమానం పొడసూపింది. కొంపదీసి నన్ను గురించిన నిజాలన్నింటినీ వీడు భార్యతో ఏకరువు పెట్టి వుండడుగదా! నమ్మించాలి! రచయిత వ్యక్తిగత జీవితాన్ని గురించి పాఠకులకెంత తక్కువగా తెలిస్తే అంత మంచిదని నా అభిప్రాయం.)

ఇంతలో ద్వారం దగ్గర కరకంకణాల కదలిక వినిపించింది. డోర్‌కర్టెన్ తొలగింది. చేతులు జోడించి, 'నమస్కారమండీ' అని చెబుతూ ఆవిడ హాల్లోకి వచ్చేసింది.

'నమస్కారం' అంటూ ప్రత్యభివాదనం చేశాను.

ఆమె పొట్టిగా వుంది. అందుకుతోడు సన్నగా వుంది. కళ్ళు మరీ చిన్నవి. ఒంటినిండుకూ ఆభరణాలున్నాయి. విలువైన చీరలు గూడా కొన్ని చాలా పాతగావు కనిపిస్తుంటాయి. ఆమె కట్టుకున్న తెల్లటి చీరగూడా బహుశా అలాంటిదే కావచ్చు. జబ్బుపడి లేచినట్టు మనిషి కాస్త నీరసంగా గూడా కనిపించింది. ఆగో ఉషాగారని అనుకోండి, రాబోయే పెళ్ళాం ఎలా వుండాలన్న విషయాన్నిగురించి మురళి తన పూర్వాశ్రమంలో నాతో ఎన్నోసార్లు ముచ్చటించి వున్నాడు. ఆ లక్షణాల్లో ఏ ఒక్కటిగూడా ఆమెలో నాకు కనబడడం లేదు.

'మిమ్మల్ని గురించి వీరు చెబుతుంటారండీ! అసలేం జరిగిందంటే, నాకు నచ్చిన కథల్ని నేనెప్పటికప్పుడు చించి పెట్టుకుంటూ వుంటాను. మళ్ళీ ఎప్పుడైనా పుస్తకంగా బైండు చేయించి దాచుకుంటాను. ఒకసారి నాటిలో ఓ పుస్తకం ఈయన చేతికి దొరికింది. అందులో మీవి నాలుగైదు కథలున్నాయి. 'వీడు నా స్నేహితుడేనేవ్' అన్నారీయన. ఆనందం పట్టలేక పోయాననుకోండి.. ఉండండి, కాఫీ తీసుకొస్తాను....'

లోపలికి వెళ్తుండగా గమనించాను. ఆమె ఒక కాలు ఈడుస్తూ ఎగరేస్తూ నడుస్తుంది.

ఏ వ్యక్తికి అంగవైకల్యం గనుక వున్నట్లయితే ఆత్మీయులైనవాళ్ళు ఇతరులా విషయం గమనించకుండా వుండేటట్టు జాగ్రత్త పడతారు. మురళి అలాంటి జాగ్రత్తలేమీ తీసుకున్నట్టు లేదు. ఇంటావిడ అలా లోపలికి వెళ్ళిందో లేదో కుర్చీ నాకు దగ్గరగా జరుపుకుని అతి ముఖ్యంగా ఏదో చెప్పదగిన రహస్యంలా ప్రారంభించాడు. 'ఏంచేద్దాం శేఖరం! ఎన్ని వుండి ఏం లాభం? అమ్మాయి యిలా పుట్టింది. ఎన్నో సంబంధాలు రావడం, వెళ్ళిపోవడం జరుగుతూ వచ్చింది. పాపం, ఆ ముసలాయన విసిగిపోయాడు. కూతురికి పెళ్ళి కాదేమోనన్న దిగులు పట్టుకుంది. అప్పట్లో ఆయనకు నేను దొరికాను. ఎలా దొరికానని అడుగుతావేమో! అదంతా పెద్ద కథ. మళ్ళీ ఎప్పుడైనా చెబుతాన్లే. అప్పుడు నా కనిపించింది. జీవితంలో మనం ఎన్నెన్నో కావాలని కోరుకుంటాం! అవన్నీ మనకు లభిస్తాయా? ఎవడి కేది ప్రాప్తమో, అదే వాడికి దొరుకుతుందని సరిపెట్టుకున్నాను. ఈ అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ వేసేశాను.'

'ఓరి మూర్ఖుడా మారీచుడా!' అని ఎగిరి గొంతెత్తి అరవాలనిపించింది నాకు! కానీ అందు కిది సమయం కాదని ప్రయత్నపూర్వకంగా నోరుమూసు కున్నాను.

కాకపోతే వీడు ఉద్ధరించిన గురించి నాకేమైనా చెప్పాలని చూస్తాడా? ఆ ముసలాయనకు తాను ఉపకారం చేసాననుకుంటున్నాడు. అది శుద్ధ తప్పు. వీడికే ఆ ముసలాయన ఉపకారం చేసాడు. మంచి యిల్లు, మంచి కారు, మంచి బ్యాంకు అకౌంటు, ఒకవైపు త్రాసులో వుంచి, 'మంచి భార్య' నింకొక త్రాసులో వుంచి వీడు తూచుకొని వుంటాడు. మొదటి త్రాసు క్రిందికి దిగి, రెండోది పైకి లేచిపోయి వుంటుంది. ఫలం దక్కేది వాలు అనుకుని వీడు వ్రతాన్ని బుగ్గిలో కలిపేశాడు. ఇంత పని చేశాక యిప్పుడు తన స్వార్థానికి అందంగా 'ఒక త్యాగం' ముసుగు తొడిగి నా కళ్ళల్లో కారం కొట్టాలని చూస్తున్నాడు.

సమయంకోసం చూస్తూ నేను నా ఆక్రోశాన్నంతా లోలోపలే అణచుకొన్నాను.

సాయంకాలమైంది. 'ఎక్కడికి వెళ్దాం?' అన్నాడు మురళి. 'కుమార్ రాజాగారి చిత్రం' అన్నాను. మురళి ఒళ్ళంతా కదిలేటట్టు నవ్వేశాడు. ఆ తరువాత అతడి కారు కదిలింది. గమ్యస్థానం సముద్రతీరం. మెరినాబీచ్ అంటే అదే నన్నాడు మురళి. మనుష్యులు తక్కువగా వున్నచోట కూర్చున్నాం.

'ఎలా వుంది మద్రాసు?' అన్నాడు మురళి.

'మదరాసుకేంరా బాబూ! చాలా బాగుంది. నాకు బాగుండనిదల్లా నీ ప్రవర్తన! నిన్నమాంతంగా ఈ సముద్రంలోకి గిరవాటు పెట్టాలని వుంది. ధర్మాధర్మాలను ద్వంద్వయుద్ధంతో పరిష్కరించుకోడం పట్ల నీకు నమ్మకముంటే నిన్నందుకు పిలిచి నీ ముక్కూ, మూతీ చదరం చేసెయ్యాలని వుంది' అన్నాను.

ఎలాగైనా ఉడుకుగాడు, ఎలాంటి 'మూడ్' అయినా వీడు పసిగడితే, పలికేటట్టుంది. హఠాత్తుగా బుంగమూతి పెట్టేశాడు. 'వెరీసారీ శేఖరం! నేనేం చేశాన్రా? నా తప్పేమిటో చెప్పు' అన్నాడు.

'మెల్లగా అడుగుతున్నావా ఆ మాట! ఇక్కడెవరో ముసలాయన్ని ఉద్ధరించడానికని ఈ సంబంధం చేసుకున్నట్టు కోతలు కోస్తున్నావు గదరా నువ్వు! ఆ మాత్రం త్యాగం అక్కడ నిన్ను నమ్ముకున్న వాళ్ళకు సాయం చేయవచ్చన్న బుద్ధి లేకపోయిందా నీకు! ప్రాణాలకు ప్రమాదమంటూ ఆ కుటుంబం నాలుగు పూర్తిగా చితికి పోతే నీకు చీమకుట్టినట్టయినా వుందా? నువ్వేదో ఉద్ధరిస్తావని నమ్ముకున్నట్టి నిన్ను యువరాజులా పెంచినందుకు, చదివించినందుకు యిదేనా నువ్వు చూపించే కృతజ్ఞత! ఛీఛీ....'

చేసిన త్యాగం వల్ల తన ఎత్తు ఆకాశం దాకా పెరిగిందని భావిస్తున్న మురళి, నా ఆరోపణవల్ల పాతాళానికి కృంగిపోయినట్టు కనిపించాడు. 'ఏం చెప్పనోయ్ శేఖరం! నన్ను వీళ్ళందరూ అపార్థం చేసుకున్నారు. కనీసం నువ్వయినా నన్ను అర్థం చేసుకుంటావేమో ననుకున్నాను. అది గూడా అడియాసే అయిపోయింది. చూడరా బాబూ! నేనొక మాటడుగుతాను. మా అక్కయ్య కూతురికి ఏం కొదవో చెప్పు. కాలొంకరా, చెయి వంకరా? దాన్నెవడైనా కళ్ళకద్దుకుని చేసుకుంటాడు. ఎటొచ్చీ దాన్ని చేసుకోలేనివాణ్ణి నేనొక్కణ్ణే! ఎందుకంటావా? ఇంత పసిబిడ్డగా వున్నప్పటినుంచి దాన్ని నేనెరుగుదును. వరసకు మామనే అనుకో. కానీ ఆ పిల్లను నేను చెల్లెలి కన్నా వేరుగా చూచింది లేదు. పోనీ, స్పష్టంగా తెలిసేటట్టు యింకొక రకంగా చెప్పనా శేఖరం! పొరబాటు వల్లనో, గ్రహపాటు వల్లనో మా అక్కయ్య ఆడదై పుట్టిపోయింది. లేదు, మగవాడై పుట్టి వుండేదనుకో! అప్పుడా పిల్ల నాకు అన్నకూతురై వుండేది. అన్నకూతుర్ని చేసుకునే మూర్ఖుడెవడైనా వుంటాడా లోకంలో?'

పరాజయాన్ని ఒప్పుకోవడంలో తప్పులేదు. మురళి వాదాన్ని వినేటప్పుడే నా తల దిమ్మెక్కిపోయిన మాట వాస్తవం. వాదంలో నిజం లేదని చెప్పడానికి నాకిప్పుడు నోరాడటం లేదు. ఏం మాట్లాడాలో తోచక కళ్ళు మూసుకున్నానేమో, అలాగే యిసుక పైకి ఒరిగిపోయాను.

కొంతసేపటికి కళ్ళు తెరిచి చూసేసరికి మురళి తాను కూర్చున్న చోట లేడు. చుట్టూరా కలయజూశాను. దూరంగా ఓ పడవ కొయ్యపైన కూర్చుని వాడు పంజాబీ దుస్తులు వేసుకున్న ఓ అమ్మాయితో మాటాడు తున్నాడు.

ఆకాశాన చందమామ. బ్యాక్‌గ్రౌండులో నీలి జలరాశి. ఆ యువతీ యువకులు ఒకరి భుజంపైన ఒకరు చేయివేసుకుని యుగళగీతం ఒకటి అందుకుంటే సినిమాలో లవ్ సీను కంతకంటే కావలసిన హంగులుండవు.

తిరిగి వచ్చాక అడిగాను. ఆవిడపేరు బబిత అన్నాడు మురళి. ఏం చేస్తుందన్నాను. ఇలాగే తిరుగుతూ వుంటుందట! నువ్విక్కడున్నావని ఎలా తెలుసుకుందన్నాను. 'అబ్బో, అందులో వేట కుక్క లాంటిది ఆవిడ ముందు దిగదుడుపు! నా కారును చూచిందేమో, చప్పున పసిగట్టేసింది. ఎందుకులే శేఖరం! నువ్వున్నావు గనుక సరిపోయింది. లేకుంటే నేనింటికి వెళ్ళకుండానే ఈ రాత్రి తెల్లవారి పోయి వుండేది....'

అప్పటి కది 'అయ్యో పాప' మంటూ సానుభూతి ప్రకటించవలసిన విషయమైనట్లు ఎంతో దీనంగా చెప్పుకపోతున్నాడు మురళి. 'చూశావుగా శేఖరం! నా సంసార సౌఖ్యం అంతంత మాత్రం! పొద్దుపొడితే, పొద్దుపోతే మా ఆవిడకు డాక్టరులతోనే పని! మొగుడన్నవాడు యింట్లో వున్నాడా, లేదా అన్న ధ్యాసయినా వుండదు....'

'సముద్రతీరము పోతిమి, చాల సేపు వుంటిమి' అని పాడుకోడానికి వీలుగా మేమింటికి చేరుకునేటప్పటికి గంట పది కావచ్చింది. చలిగాలులు వీచడం ప్రారంభమైందేమో, నరాలు జివ్వు జివ్వు మంటున్నాయి. తువ్వాలు ఒకటి తలకు చుట్టుకుని గదిలో కూచున్నాను. పేపరులో తల దూర్చుకోడం వల్ల పని పిల్ల గోపాలికి వచ్చిపోతుండడం గురించి నేనంతగా పట్టించుకోలేదు. పళ్ళెరాలు, ప్లేట్లు, చెంచాలు కదులుతున్న చప్పుడు మాత్రం విన్నాను. మురళి తలుపులు మూసి గడియ పెట్టేశాడు. 'రోజూ చూచే పేపరే గదా! దాని కిప్పు డేమొచ్చిందిగాని, దీని సంగతి చూడు శేఖరం!' అన్నాడు.

పేపరు క్రిందికి దించి టేబిలుపైన పోగుచేసుకున్న సరుకుల వైపు చూచేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది.

'ఇదెప్పటినుంచిరా మురళీ?' హతాశుడనైపోతూ అడిగాను.

'మునుపటి కెవరో గుడ్డివాడన్నాడట— 'వెన్నెల మహిమల్ని గురించి వినడమేగాని, కన్నది లేదు' అని! నీకీ అనుభవం అలాంటిదేనని నాకు తెలుసు. పోనీ, యిప్పుడు కాస్త రుచి చూడరాదా శేఖరం! ఈ మాత్రం పనికే ఆదర్శాలు మట్టి గొట్టుక పోవులే! త్రాగి మత్తుగా పడి వుండడానికేమీ గాదు. కాస్త ఉత్తేజం కలగడానికి! ఏ వైన్ డ్రింక్ ఫర్ గుడ్ హెల్త్! ఫరవాలేదులే శేఖరం! పుచ్చుకో....'

'అందులో మొక్కడానికి అనుభవ ముండాలి. నువ్వు అనుభవజ్ఞుడివి. కానివ్వు. నేను చూస్తూ కూర్చుంటాను' అన్నాను.

— అనుమతి లభించడమే తడవేలుగా మురళి లోటా పైకెత్తి కొద్ది నిమిషాల్లో ఖాళీ చేసేశాడు. ప్లేటులోనుంచి యున్న ముక్కలు, యింకులో నుంచి కొన్ని బంగాళాదుంపల చిప్సు, పొట్లంవిప్పి నాలుగైదు బిస్కెట్లు కరకరా నమిలి మింగేశాడు. ఎర్రబడిన అతడి కళ్ళల్లోనుంచి యిప్పుడు ఉత్తేజం తొంగి చూస్తోంది.

'మరేం భయపడొద్దు శేఖరం! ఇది నన్నేం చెయ్యదులే! నా హద్దుల్లో నే నుండగలను.'

తనను తాను నియమించుకోడాని కన్నట్లుగా అరచేతులతో ముఖాన్ని రుద్దుకుంటూ కొనసాగించాడు మురళి. 'ఎక్కడో చదివాను నేను. రామరాజ్య మనేది ఒక ఆశయం. కాని తీరా సిద్ధించిన తరువాత మనిషిపాలిటి కది చవిసారం లేకుండా చాలా చప్పగా వుంటుందట! ఇప్పుడు నా పరిస్థితి గూడా అలాగే ఉందేమో ననిపిస్తోంది. అలా అనిపించినప్పుడల్లా నా బుద్ధి పిచ్చెక్కి పోతుంది. నీకు జ్ఞాపకం ముందా శేఖరం! మనం చిన్నప్పుడు ఎన్నెన్నో ఘనకార్యాలు చేయాలను కున్నాం....'

నా సందేహం నాది! వీడు నిషా తలకెక్కి మాట్లాడ్డం లేదుగదా!

'కాని దేనికైనా సమయం రావాలి. అదిప్పుడు వచ్చిందనుకో! ఓ పత్రిక పెడదామని నా ఆలోచన....'

అర్ధరాత్రి దాకా చర్చించాం. ఊహాలోకంలో నేనెన్నో పత్రికలకు రూపకల్పన చేసి వుండడం ఆ సందర్భంలో నాకు ఉపకరించింది. త్రివర్ణచిత్రంతో అందమైన ముఖపత్రం. పచ్చపువ్వులాంటి కాగితం. వంద పుటలకు తగ్గని పరిమితి. సర్వతోముఖంగా వికసిస్తున్న మానవవిజ్ఞానాన్ని విశదీకరిస్తూ రసగుళికల్లాంటి వ్యాసాలిందులో వుండాలి. వాటి మధ్య మధ్య రెండు కథలూ, ఒక నాటిక తప్పని సరి! ఆణిముత్యాల లాంటి కవితలు కొన్ని అవశ్యం వుండవలసిందే! ఈ పత్రిక విభిన్న దృక్పథాలు కలిగిన మేధావుల కందరికీ చర్చావేదికగా వుండాలి. జిజ్ఞాసువులకు కరదీపికలా ఉపయుక్తం కావాలి. 'గ్రాండ్, గ్రాండ్' అంటూ నా సూచనలపైన ఆమోదముద్ర వేస్తూ వచ్చాడు మురళి. మంచి పేరు కుదరడమే ఆలస్యం, డిక్లరేషన్ కోసం వ్రాసి పారేస్తా నన్నాడు.

* * * *

నేను మద్రాసు వెళ్ళి వచ్చి ఏడాది దాటింది. వచ్చిన కొత్తలో కొన్ని ఉత్తరాలు వ్రాసి చూచాను. ప్రత్యుత్తరం లేదు. పరిస్థితులు అనుకూలించక పోవడం వల్ల సుభాషితాలకు మల్లే సదుద్దేశాలు గూడా భావంలో జీర్ణమైపోతాయేమో! మురళి పెట్టదలచుకున్న పత్రిక గతి గూడా అంతే అయి వుండవచ్చు.

కుటుంబ జీవితంలో ఎదురైన ఒడుదుడుకుల వల్ల ఆ విషయాన్నిగురించి అంతకుమించి ఆలోచించే అవకాశం నాకు లేకపోయింది. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు నాకు నిద్రపోకుండా పెరుగుతూ వచ్చిన పిల్లలతో కలిసి ఒక్క పెట్టున నా పైన విరుచుకు పడ్డాయి. వాటి బారినుంచి బయట పడ్డంకోసం ఉన్న భూస్థితిలో సగానికి పైగా అమ్ముకోవలసి వచ్చింది. పోయింది పోగా మిగిలివున్న పొలానికి బావినీరే ఆధారం. అది ఉమ్మడి బావి. ఆ బావి క్రింద పెద్ద భాగం కలిగివున్న ఆసామి బలిబాగా సిద్ధంగా పంపుసెట్టు బిగించుకోడంతో చిన్న కమతాల్లో గింజ పండించే ప్రాప్తి లేకపోయింది. అతడు పంపుసెట్టులో వాటా యివ్వడు. మోటకోల పైకెక్కించుకునే అవకాశం లేదు. అదేమిటని నిలదీసి అడిగితే యింజనుకు ఒక సాలీను రేటు నిర్ణయించి, ఆ ధరకు చిన్న భాగాలను గూడా తనకే దఖలు పరచమంటాడు. వ్యవహారాన్ని కోర్టుకు తీసుకెళ్ళక తప్పింది గాదు. ప్రతివాది పక్షంలో న్యాయం లేకపోవచ్చు. కాని డబ్బుంది. అతడు మనుషుల్ని కొనేస్తున్నాడు. నా సాక్షుల్ని తన వైపుకు తిప్పుకుంటున్నాడు. నా లాయరు పైకి ఒత్తిడి తెస్తున్నాడు. ఆ కేసింకా కోర్టులో వుండగానే, పులిమీద పుట్రలా యింట్లో ఒకరుపోతే ఒకరు జబ్బుతో మంచ మెక్కసాగారు. ఆసుపత్రుల వెంట తిరగ వలసి వచ్చింది. ఆ ప్రయాణాల్లో ఒకసారి బస్సులో వెళ్తుండగా ఓ పత్రిక నా కంట పడింది. ఎవరో చదువుతున్నాడు. ముఖచిత్రంగాని, మిగిలిన బొమ్మలుగాని యితరులకు కనిపించకుండా వుండడంకోసం తంటాలు పడుతూ అందులోని 'మేటరు'ను మాత్రం చూపులతో జుర్రేస్తున్నాడు!

'బాబూ! ఏం పత్రికయ్యా అది?' అంటూ చేయి చాచాను.

'ఇదా! ఇదొకటి తెలీదే!' ఆ కుర్రాడు నా వైపు కొరకొర చూస్తూ పత్రికను కాస్త తన లెదర్ బ్యాగులోకి చేరవేయజూచాడు.

కాని అంత పని జరిగేలోగా నేను దాన్ని నా చేతిలో చిక్కించుకోగలిగాను.

ఆ పత్రిక నా చేతిలో వున్న ఒక్కొక్క క్షణంలోనూ, నేను ఒక్కొక్క అనుభూతికి లోనౌతూ వచ్చాను. పది క్షణాలు గడిచేసరికి భూతంలా అన్ని అనుభూతుల్నీ మింగేస్తూ భయం నన్ను ఆవహించింది. ప్రక్కన కూర్చున్న పడుచువాడు ఆ పత్రిక చేతిలో వుండగా అలా కంగారు పడిపోవడమెందుకో నాకు తెలిసి వచ్చింది. ఇప్పుడు నన్ను పట్టుకున్నది గూడా దాన్ని నేను చదువుతుండగా ఎవరైనా చూచిపోతారేమోనన్న జంకుగొంకులే! ఎక్కడలేనంత మైకంలో ఒళ్ళు తూలిపోవడం కోసం హిప్పీలనేవాళ్ళు అభిని మందు లాంటిదేదో సేవిస్తారట! వాళ్ళు ఇహ ఇలాంటి రచనలు చదవడానికి అలవాటు పడి, ఇంతకంటే ఘాటుగా వుండడంకోసం ఆ మందును సేవిస్తూ వుండాలి. మనిషిలో మృగతత్వం ప్రవేశ పెట్టటానికి ఇందులోని ఒక రచనే చాలు! మనసును కోతిగా మార్చడానికి ఒక బొమ్మ చాలు! సభ్యతని, సంస్కారాన్ని మైనస్ చేసి, మిగిలిన బ్రతుకునంతా కామలిప్సాపరిపూర్తికే అంకితం చేసేస్తే అప్పటి మానవ జగత్తు ఎలా వుంటుందనడానికి ప్రత్యేకంగా ఆలోచించ నక్కర్లేదు. దీన్నొకసారి చదివితే చాలు! గబుక్కున దాన్ని మూసేశాను. కాని వాపసు చేయడానికి ముందుగా ఇంతటి మహత్కార్యానికి కారణభూతమైన ఉపజ్ఞ ఎవరిదో తెలుసుకోడం న్యాయమనిపించింది. అందుకోసం మళ్ళీ తెరిచాను. ఆ పేరు కనిపించగానే నిర్ఘాంతపోయాను. మురళి ఆలోచనకు కార్య రూపమా ఈ పత్రిక!

నేను కూర్చున్న బస్సు శరవేగంతో పరుగిడుతోంది. పైన పేర్కొన్న ఉదంతం జరిగిన తర్వాత అడుగడుగునా అదేదో ఘోర ప్రమాదానికి గురికానున్నట్టు నా కనిపించ సాగింది. ఆ రోజు సురక్షితంగా గమ్యస్థానం చేరుకోడం నా మట్టుకు నాకొక మహాద్భుతమైన విషయంగా గోచరించింది. బస్‌స్టాండులో దిగగానే నేరుగా మొదలియారు బంకుకే దారి తీశాను. పట్టణంలో న్యూస్ ఏజంటుగా ప్రసిద్ధుడు మొదలియారు. ఎప్పటిలాగే నవ్వుతూ పలకరించాడు. 'ఏం పత్రిక కావాలండీ మేష్టరు గారూ!' అన్నాడు.

అప్పటికే చూపులతో బంకునంతా ఒక పరస గాలించివున్న నేను 'ఆ పత్రిక ఇక్కడున్నట్టు లేదు' అన్నాను.

'పేరు చెప్పండి' అన్నాడు మొదలియారు.

చెప్పాను.

'పోలీసు వాళ్ళదొకటే దాడండీ అయిపోయిందిలెండి మేష్టరుగారూ! ఆ పీడ కొని తెచ్చుకోడమెందుకని విచారడుగుతున్న పత్రికని బయట పెట్ట లేదు. లోపలుంది. తెచ్చి పెట్టమంటారా?' అన్నాడు మొదలియారు.

'లోపలుంటే అది అమ్మకమయ్యే విధాయకం ఎట్లాగబ్బా' అంటూ ఆశ్చర్యం ప్రకటించాను.

'బాబూ! మీకా డవుటక్కర్లేదు. అన్నింటికన్నా ఎక్కువగా అమ్ముడు పోయేది అదే! మొదటి నెల వంద కాపీలే తెప్పించాను. రెండో నెల రెట్టింపు చేశాను. ఈ మాసం సర్క్యులేషన్ అయిదొందలు. . .'

మొదలియారు మూలంగా తెలిసిన వర్తమానం వల్లనేమో నేను చెప్పను, ఉదయం నుంచి పరగడుపుతో వుండడం వల్ల గూడా కావచ్చు. నా కళ్ళెదుట ఇళ్ళు, అంగళ్ళు, బస్సులు, లారీలు రంకులరాట్నంలా గిర్రున తిరుగుతున్నాయి.

'ఏమండీ మేష్టరుగారూ! దానికి ఘాటొక కథ రాయగూడదూ? బాగా డబ్బు లొస్తాయి గూడా!' అన్నాడు మొదలియారు.

'ఎంతిస్తారేమిటి?'

నమ్మడానికి వీల్లేనంత పెద్ద సంఖ్యే చెప్పాడు మొదలియారు.

తనకెలా తెలిసిందని అడిగాను. దీనికి సంబంధించిన ప్రకటన అందులోనే వుందట!

'వ్రాయొచ్చు, వ్రాస్తాను' అని చెప్పకుండా నేను గుడ్లు మిటకరించడం మొదలియారుకు నచ్చలేదు. 'ఐనా మీకు డబ్బుకు కొదవలేదేమో! మీరెందుకు రాస్తారు లెండి!' అంటూ అతడు నిష్ఠూరంగా ఓ చురక తగిలించాడు.

నాకా! నాకు డబ్బుకు కొదవ లేదా! నా కిప్పుడు కావలసివున్నదే అది. ఇప్పుడొక అయిదు రూపాయలుంటే ఆసుపత్రిలో వున్న మా అమ్మకు ఆవిడ కోరినన్ని పళ్ళు కొనిపెట్టగలను. పది రూపాయలు దొరికితే చంటి పాపకు పాలడబ్బా కొనుక్కుపోగలను. పాతిక రూపాయలుంటే చెడిపోయిన వాచీ రిపేరు చేయించుకోగలను. యాభై రూపాయలు లభ్యమైతే ఓ చీర తీసుకెళ్ళి పండగకు పుట్టింటికి వచ్చివున్న మూడో చెల్లెల్ని అత్తగారింటికి తరలించ గలను. .. అవసరాలన్నింటికీ సరిపోయి, ఇంకా నాలుగు రూకలు చేతిలో మిగిలే అవకాశం ఒకటి కళ్ళముందర కనబడుతుండగా దాన్ని నేనెందుకు వదులుకోవాలి? పేరెందుకు, కూరొండుకోడానికా? నీతెందుకు, జాడీలో పాతరవేసి ఊరగాయ పెట్టుకోడానికా? మంచి చెడ్డల విచక్షణ చేస్తూ కూచోడమెందుకు, మంచి ముహూర్తాలు కాస్తా దాటి పోవడానికా? వెయ్యిమాటలెందుకు? 'బహుభంగుల విత్తమే మాకు మేలు!' చేస్తున్న పనికి వెనుకనున్న రీతినీ, నీతినీబట్టి కాకుండా, ఆ పని మూలంగా గడించ గలుగుతున్న రూపాయల మొత్తాన్నిబట్టే మాత్రమే మనిషికి విలువ లెక్కగట్టబడుతున్న సమాజంలో ఆదర్శాలను వల్లిస్తూ కూచోడం అవివేకం. కాకపోతే ఇతడు, ఈ మొదలియారు లాభసాటి పనులు చేయడం నీచేత నేమవుతుందని నన్ను ఈసడిస్తాడా? నేనతడి మాటను సవాలుగానే స్వీకరించ దలచుకున్నాను.

ఆసుపత్రి ఆవరణలో ఒక వేప చెట్టుంది. నీడ కదిలికనుబట్టి వేపచెట్టు క్రింద తావు మార్చుకుంటూ సాయంకాల మయ్యేసరికి ఇరవై పుల్ స్కావు పేజీల నిండుకూ ఓ రచనను దట్టించేశాను. 'కాచుకోరా మురళీ! మాదర్చోద్ దేవుడికి ఇదిగో గోదర్చోద్ పత్రి' అనుకున్నాను.

ప్రయాణాన్ని గురించి మళ్ళీ ఏకరువు పెట్టను. ఎలా వెళ్ళానో అలాగే వెళ్ళాను. ఎక్కడ దిగాలో అక్కడే దిగాను. ఇంటికి మాత్రం వెళ్ళలేదు. కార్యాలయంలోనే మురళిని సంధించాను.

నన్ను చూడగానే మురళిలో ఎందుకో తొట్రుబాటు కనిపించింది. 'ఇదేమిటోయ్ శేఖరం! ఎప్పుడు రావడం? ఇంటికి వెళ్ళలేక పోయావా? ఇక్కడికెందుకొచ్చావురా బాబూ!' అన్నాడు.

'వచ్చిన పని చెబుతానుగానీ, ముందు నువ్వు కూచో! తరువాత నన్ను కూచోనివ్వు' అన్నాను.

కుశల ప్రశ్నలు ముగిశాక ఏవో కబుర్లు మొదలెట్టబోయాడు మురళి. వాటిని వినే ఆసక్తి నాకెక్కడిది? సూటిగా అసలు విషయంలోకి వొచ్చాక రాదలచుకుని, 'మరైతే నువ్వు చేస్తున్న పనిని గురించి నాకొక మాట వ్రాసి వుంటే నీదేం పోయింది మురళీ! అందులో పాలుపంచుకోడానికి నేను బొత్తిగా తగనా? నీ అభిప్రాయం?' అన్నాను.

మురళి గబాలున లేచి నిల్చున్నాడు. నా చేతులు రెండింటినీ తన చేతుల్లోకి తీసుకుంటూ 'అంత మాటనకురా శేఖరం! నిన్నిందులో పాలు పంచుకోమని నేనెలా అడగగల్గినా? నువ్వు దీనికి రాయవు. ఒకవేళ రాశావుపో, నేను వేసుకుంటానా? నేను తింటున్నది గడ్డికాదే! ఎంత చెడినా నాలో నరవాసనలింకా మిగిలే వున్నాయిరా బాబూ!' అన్నాడు.

నాకు ఏడుపొచ్చినంత పనయింది! నా అంతటి నేను నా గాడిద బరువును వదిలించుకోవా లనుకున్నాను. దించుకుంటాను బాబో అని మొత్తుకున్నాను. బాల్యమిత్రుడే వినిపించుకోలేదు. ఇంక నా మొర వినిపించుకునే నాథు డెవరు? కొందరి కొందరి జన్మరాత ఇంతేనేమో!